RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శనివారం 18-7-2026 | సంచిక: 13 | సంఖ్య: 289 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి






## మూసీ అభివృద్ధికి భూములిస్తాం..

### కానీ న్యాయమైన పరిహారం కావాలి

### హైదర్‌గూడ భూ బాధితుల ఆవేదన..

- 'డబ్బు కాదు.. మా జీవితాల ప్రశ్న'
- గజానికి రూ.51 వేలు లేదా ఎకరానికి రూ.20 కోట్ల పరిహారం
- ఆఫర్ చేసిన అధికారులు..
- త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచన

4లో

### బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు

## షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

### రేపటి బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి

### శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ

- పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు
- ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్



2లో




4లో

## మాన్‌సూన్ ముసుగులో దందా..!

### వానలు రాకముందే కాసుల వర్షం? హైడ్రా మాన్‌సూన్ పనుల్లో నిబంధనల ఉల్లంఘనలపై తీవ్ర ఆరోపణలు

- రూ.85 కోట్ల పనులపై ప్రశ్నలు.. 8 ఏజెన్సీలకే మెజార్టీ టెండర్లు.. మూడు షిఫ్టుల పేరుతో ఒకే షిఫ్ట్ నిర్వహణ?
- మ్యానువల్ బిల్లింగ్‌పై విమర్శలు.. పారదర్శకతపై సందేహాలు.. సమగ్ర విచారణకు డిమాండ్



## మళ్లీ కోవిడ్ వ్యాప్తి!

### ఏపీలో నలుగురు మృతి, 13 యాక్టివ్ కేసులతో కలకలం

### దేశవ్యాప్తంగా 340కిపైగా కొత్త కేసులు నమోదు

హైదరాబాద్: దేశంలో మళ్లీ కోవిడ్ వ్యాప్తి వార్తలు కలకలం సృష్టిస్తున్నాయి. జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా 340కిపైగా కొత్త కేసులు నమోదయ్యాయి. ఏపీలో జూన్ 26 నుంచి శుక్రవారం వరకు నలుగురు కోవిడ్‌తో మృతిచెందగా మొత్తం 13 కోవిడ్ యాక్టివ్ కేసులు రికార్డయ్యాయి.

2లో

## ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు

### తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

- ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
- ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినేట్
- జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా

ధరణి

2లో



## ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

- బార్ల సమయం పొడిగింపు
- ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా హైదరాబాద్‌లో బార్ల వేళల పొడిగింపు
- ఫైనల్ మ్యాచ్ రోజు తెల్లవారుజాము 3 గంటల వరకు మద్యం సరఫరాకు అనుమతి
- మూడో స్థానం మ్యాచ్ కోసం తెల్లవారుజాము 4:30 గంటల వరకు పర్మిషన్
- ఫుట్‌బాల్ అభిమానుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం



## ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి..

### హార్టికల్చర్ హబ్‌కు నిధులివ్వండి: నిర్మలకు చంద్రబాబు వినతులు

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- రొయ్యల మేత ధరలు తగ్గించి, ఆక్వా రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి
- పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్రం దృష్టికి
- రాయలసీమలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు సహకారంపై చర్చ
- రిలయన్స్ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు ప్రతిపాదన

2లో



## హరిత రవాణా దిశగా ముందడుగు

- దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలు ప్రారంభం
- 'మేక్ ఇన్ ఇండియా'కు ఇది విజయవంతమైన ఉదాహరణ
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

జింద్/జలంధర్: దేశంలో హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రారంభించుకోవడం హరిత రవాణా దిశగా కీలకమైన ముందడుగు

2లో



## పథకం పరిధిలో 1,816 రకాల వైద్యం, శస్త్రచికిత్సలు

### నూతన ఈహెచ్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- 886 ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగులకు నగదు రహిత వైద్యం
- పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగులను పట్టించుకోలేదు

హైదరాబాద్: ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) నూతన అధ్యాయానికి నాంది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 886 ప్రైవేట్ నెట్‌వర్క్

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# హరిత రవాణా దిశగా ముందడుగు

, 'మేక్ ఇన్ ఇండియా'కు ఒక విజయవంతమైన ఉదాహరణగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత్‌లో మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ఆయన శుక్రవారం హరియాణాలోని జింద్ స్టేషన్‌లో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. జింద్-- సోనిపట్ మార్గంలో ఈ రైలు ప్రయాణిస్తుంది. ప్రపంచంలో హైడ్రోజన్ ఇంధన రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల జాబితాలో భారత్ కూడా చేరింది. మోదీ హరియాణాలో రూ.14,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం ఇచ్చారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించారు. హైడ్రోజన్ రైలు ఆత్మనిర్భర్ భారత్, ఆధునిక రవాణా వ్యవస్థ పట్ల మన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. గతంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల తలెత్తిన పరిస్థితులు ఒకవేళ 2014కు ముందే ఏర్పడి ఉంటే భారతీయ రైల్వేల కార్యకలాపాలు స్తంభించిపోయేవని పేర్కొన్నారు. ఎందుకంటే అప్పట్లో దేశంలోని చాలా ప్రాంతాల్లో రైళ్లు ప్రధానంగా డీజిల్‌తో నడిచేవని గుర్తుచేశారు. అప్పట్లో డీజిల్ సరఫరాకు అంతరాయం కలిగి ఉంటే డీజిల్ ఆధారిత రైళ్లు ఆగిపోయేవని పేర్కొన్నారు. దేశం భారీ సంక్షోభాన్ని ఎదుర్కొనేదని చెప్పారు. కానీ, ఇది 2014 నాటి పరిస్థితి కాదన్నారు. "సమస్యలకు పరిష్కారాలను ముందుగానే ఆలోచించి, వాటిని క్షేత్రస్థాయిలో వాస్తవ రూపంలోకి తీసుకువచ్చే వ్యక్తి మోదీ. పశ్?చమాసియా నేడు రణరంగంగా మారింది. హోర్ముజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో యుద్ధం కొనసాగుతోంది. యుద్ధం, చమురు సంక్షోభం ఉన్నప్పటికీ భారత రైల్వేలు, దేశ అభివృద్ధి పరుగు మాత్రం ఆగిపోలేదు"అని వ్యాఖ్యానించారు.

**అత్యంత పొడవైన రైలు**

"హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడిపే సామర్థ్యం కేవలం మూడు లేదా నాలుగు దేశాలకు మాత్రమే ఉంది. 21వ శతాబ్దపు ఈ సాంకేతికత విషయంలో భారతీయ రైల్వే ఒక పెద్ద ముందడుగు వేసింది. ఈ రైలు 3,200 హార్స్‌పవర్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది అత్యంత శక్తివంతమైనదే కాకుండా అత్యంత పొడవైనది(10 కోచ్‌లు) కూడా. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో హైడ్రోజన్ రైలుకు కేవలం మూడు లేదా నాలుగు కోచ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ, మన దేశంలో ఈ రైలుకు 10 కోచ్‌లు ఉన్నాయి. ఈ భారీ హైడ్రోజన్ రైలును నడపడం ద్వారా భారత్ ప్రపంచ వేదికపై తనదైన ముద్ర వేసింది. భవిష్యత్తులో హైడ్రోజన్ రైలుకు సంబంధించిన మరిన్ని మౌలిక సదుపాయాలు రాబోతున్నాయి.

**కురుక్షేత్రలో సిక్కు మ్యూజియం**

జింద్ పట్టణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతం కావడం హర్షణీయం. స్వచ్ఛతను ప్రజలు తమ జీవన విధానంలో, దైనందిన జీవితంలో ఒక అంతర్భాగంగా మార్చుకోవాలి.

# పథకం పరిధిలో 1,816 రకాల వైద్యం, శస్త్రచికిత్సలు

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రుల ద్వారా ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా 8 లక్షల మంది ఉద్యోగులతో పాటు మొత్తంగా 29.80 లక్షల మంది ఉచిత ఇన్‌పేషెంట్ వైద్య సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ప్యాకేజీ రేట్లకు అనుగుణంగా 1,816 రకాల వైద్యం, శస్త్రచికిత్సలు ఈ పథకం పరిధిలోకి వస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక భరోసా, నమ్మకం కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని ఒక చక్కటి ఆరోగ్య భద్రత వ్యవస్థను అందించాలనేదే సర్కారు ఉద్దేశమన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా పని చేస్తారని, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతాయని, అన్నారు. శుక్రవారం సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహతో కలిసి కొత్త ఈహెచ్ఎస్ పథకాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

**ఉద్యోగులపై ప్రేమ, చిత్తశుద్ధికి నిదర్శనం**

'ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధికి ఈ పథకమే నిదర్శనం. ఉద్యోగులు కూడా కుటుంబ సభ్యులే. వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, వాటిని తీర్చలేక సతమతమవుతున్న దుస్థితిని గమనించాం. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంతో ఆలోచించి కొత్త ఆరోగ్య పథకాన్ని తీసుకొచ్చింది. అలాగే రాష్ట్రంలో అర్హులైన 1.06 కోట్ల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. దీని పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం.

**రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తున్నాం..**

రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు చేసిన కృషిని మరవలేము. అలాంటి ఉద్యోగుల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. పదేళ్లలో రూ.10 వేల కోట్లు అప్పు చేసింది కానీ ఉద్యోగుల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసింది. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు రూ.10 వేల కోట్ల బిల్లులను మా ప్రభుత్వం మానవీయ కోణంలో క్లియర్ చేస్తోంది. పెండింగ్ బిల్లులను నెలకు రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేస్తున్నాం. ప్రతి 15 రోజులకోసారి నేను స్వయంగా సమీక్షిస్తున్నా..'అని భట్టి చెప్పారు.

**20 ఏళ్ల ఆకాంక్ష నెరవేరింది: మంత్రి దామోదర**

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ.. 20 ఏళ్ల ఆకాంక్ష ప్రజా ప్రభుత్వంలో నెరవేరిందని చెప్పారు. నగదు రహిత వైద్య సేవలు చరిత్రాత్మక నిర్ణయమన్నారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి మార జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ఇదొక శుభదినం'అని అన్నారు.

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం...

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, దానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటన విడుదల చేశారు. రేపు శనివారం విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అల్పపీడన ప్రభావంతో కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించారు. ప్రజలు చెట్ల కింద, పెద్ద హోర్డింగ్‌ల సమీపంలో నిలబడొద్దని సూచించారు. సముద్రం అలజడిగా ఉండి, అలల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వేటకు వెళ్లకపోవడం సురక్షితమని స్పష్టం చేశారు.

## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు: కాకాణి గోవర్ధన్ రెడ్డి

ఆదాయ వనరులు సమకూరితే, ప్రస్తుతం చంద్రబాబు వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని కాకాణి దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో నిర్మించిన రామాయపట్నం పోర్టును ఈ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనమని కాకాణి విమర్శించారు. ఈ ప్రభుత్వంలో గ్రావెల్ తవ్వకాల నుంచి నిరుద్యోగుల డీఎస్సీ నోటిఫికేషన్ వరకు ప్రతి ఒక్క విషయంలోనూ అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ప్రతి పథకంలోనూ, ప్రభుత్వ నిర్ణయంలోనూ పారదర్శకత లోపించిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కాకాణి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

## మళ్లీ కోవిడ్ వ్యాప్తి!

అయితే కోవిడ్ బారినపడిన రోగులంతా స్వల్ప లక్షణాలతో హోమ్ ఐసోలేషన్‌లోనే కోలుకుంటున్నారని.. తీవ్రమైన దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నందునే ఏపీలో నలుగురు రోగులు మృతిచెందారని వైద్యులు నిర్ధారించారు. తాజా కేసులు కొత్త కోవిడ్ వేవ్‌కు లేదా మహమ్మారి విజృంభణకు సూచికలు కాదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, వైరస్‌లో స్వల్ప మార్పులు (మ్యుటేషన్లు) జరగడం వల్ల అక్కడక్కడా క్లస్టర్లుగా మాత్రమే ఈ కేసులు నమోదవుతున్నాయని వైద్య శాఖ వెల్లడించింది. అయితే ఈ కేసులు వేగంగా వ్యాపించే ఒమిక్రాన్ సబ్--వేరియంట్ వల్ల వచ్చి ఉంటాయనే అనుమానంతో అధికారులు నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపారు. ప్రస్తుత పరిస్థితుల వల్ల ప్రజారోగ్యానికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్య నిపుణులు, అధికారులు స్పష్టం చేస్తున్నారు. అందరికీ వ్యాక్సినేషన్ ద్వారా రోగనిరోధక శక్తి పెరగడం వల్ల తీవ్రమైన ప్రమాదం తప్పిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి..

ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన వినతులు సమర్పించారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆక్వా, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని, రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన హార్టికల్చర్ హబ్‌కు సహకరించాలని సీఎం కోరారు.

**ఆక్వా రంగంపై తక్షణమే దృష్టి సారించాలి**

ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, తక్షణం కేంద్రం విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు కోరారు. రొయ్యల మేత తయారీకి ఉపయోగించే ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం 20 శాతానికి పైగా పెరిగిందని వివరించారు. ఫిష్ మీల్ టన్ను రూ.1.55 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు, చేప నూనె టన్ను రూ.2.80 లక్షల నుంచి రూ.4.40 లక్షలకు పెరిగిందని గణాంకాలతో సహా వివరించారు. ఈ భారం టన్నుకు రూ.25 వేల వరకు పెరిగిందన్నారు. అదే సమయంలో, భారత్ నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలపై అమెరికా 5.77 శాతం కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ విధించిందని, యాంటీ డంపింగ్ డ్యూటీ వేసే ఆలోచనలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రొయ్యల ఎగుమతుల్లో 80 శాతం ఏపీ నుంచే జరుగుతున్నాయని, ఈ సుంకాల వల్ల రాష్ట్రంలోని 30 లక్షల మంది జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాతో సంప్రదింపులు జరపాలని, రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌తో 'ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీ' ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**పొగాకు రైతులను ఆదుకోవాలి**

జీఎస్టీలో పొగాకు ఉత్పత్తులను అత్యధిక పన్ను శ్లాబులో చేర్చడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీని కారణంగా తయారీదారులు కొనుగోళ్లు తగ్గించడంతో వేలం ప్రక్రియ నెమ్మదించిందన్నారు. ఈ ఏడాది 230 మిలియన్ కేజీల ఉత్పత్తికి గాను కేవలం 34 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారని, ఇది రైతులు, కార్మికులు, రవాణా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించి పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు.

**రాయలసీమ సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళిక**

రాయలసీమను దేశంలోనే అగ్రగామి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన 'రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టీకల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్'కు పూర్తి సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. ఈ ప్రణాళిక ద్వారా రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో ఏటా రూ.81 వేల కోట్ల స్థూల విలువ జోడింపు (+వాా), 19.7 లక్షల ఉద్యోగాలు సృష్టించవచ్చని వివరించారు. ఆగస్టు 6-7 తేదీల్లో ఈ ప్రాజెక్టు పనుల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని నిర్మలా సీతారామన్‌ను ఆహ్వానించారు.

**వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలకు 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'**

ఈ హార్టికల్చర్ హబ్ ప్రణాళికలో భాగంగా, రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (xూూా) ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. వ్యవసాయంలో ఏఐ, డిజిటల్ టెక్నాలజీ, వాతావరణ సుస్థిరత వంటి అంశాలపై పరిశోధనలు ప్రోత్సహించేలా ఇది గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పనిచేస్తుందన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థ ఏర్పాటుకు కేంద్రం తోడ్పాటు అందించాలని కోరారు.

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

ఫిఫా ప్రపంచ కప్ 2026 తుది అంకానికి చేరుకున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోని ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రపంచ కప్ ఫైనల్ పోరుతో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ల దృష్ట్యా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బార్లు, క్లబ్బులు, మైక్రో బ్రూవరీలను నిర్ణీత సమయం కంటే అదనంగా తెరిచి ఉంచేందుకు అనుమతినిచ్చింది. రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, జూలై 18 రాత్రి మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్ సందర్భంగా తెల్లవారుజామున 4:30 గంటల వరకు మద్యం సరఫరాకు వెసులుబాటు కల్పించారు. అలాగే, జూలై 19న అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య రాత్రి జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోసం తెల్లవారుజామున 3 గంటల వరకు బార్లను తెరిచి ఉంచేందుకు అనుమతించారు. ఫిఫా ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి లేదా ఆ తర్వాత ప్రారంభమవుతుండటంతో అభిమానులు తమ ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. పబ్లిక్ ప్లేసుల్లో ఇతరులతో కలిసి బిగ్ స్క్రీన్లపై వీక్షించే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో బార్ల పనివేళలను పొడిగించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ జూలై 14న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనిపై సానుకూలంగా స్పందించిన రెవెన్యూ శాఖ తాజాగా అనుమతులు మంజూరు చేయగా, ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఫుట్‌బాల్ ప్రేమికులు స్నేహితులతో కలిసి బిగ్ స్క్రీన్‌లపై మ్యాచ్‌లను తిలకిస్తూ ఆనందించే అవకాశం లభించింది. అయితే, పొడిగించిన పనివేళల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని అధికారులు స్పష్టం చేశారు.

## ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు

ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలులోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది.



## ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు వేసిన కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్.17 ( నేటి ప్రస్థానం.) సోమారం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహాన్ని శుభ్రపరచి రంగులు వేయించిన కాంగ్రెస్ నేతలు. రంగులు వేసిన అనంతరం శుక్రవారం పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శ్యామ్ రావు, నరసింహ యాదవ్, హనుమండ్ల సురేష్, బందెల ముత్యాలు, రమేష్, సిహెచ్ శ్రీనివాస్ యాదవ్, నురుగని బిక్షపతి యాదవ్, లోకేష్ , గ్రామ యువకులు పాల్గొన్నారు.

## (SIR)లో నమోదు చేసుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి







**మేడ్చల్ .17 .( నేటి ప్రస్థానం):** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (SIR)లో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు మల్లారెడ్డి గారు.నేడు తన ఓటు వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నింపి సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి గారి సతీమణి శ్రీమతి కల్పన రెడ్డి గారు కూడా తమ వివరాలను ఎన్నికల అధికారులకు అందజేసి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతి నీటి బొట్టే భవిష్యత్‌కు భరోసా

### 'క్యాచ్ ది రైన్' కార్యక్రమంలో విద్యార్థులతో జల సంరక్షణ ప్రతిజ్ఞ

### నీటి పొదుపుపై వ్యాసరచన పోటీలతో చైతన్య స్ఫూర్తి




గుమ్మడిదల, జూలై 17 (నేటి ప్రస్థానం): భూగర్భ జలాల పరిరక్షణ, వర్షపు నీటి సద్వినియోగం, నీటి వృథా నివారణపై విద్యార్థుల్లో బాధ్యత పెంపొందించే లక్ష్యంతో గుమ్మడిదల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జల శక్తి జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన "క్యాచ్ ది రైన్" ప్రచారంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వర్షపు నీటిని సేకరించడం, ప్రతి నీటి బొట్టును విలువైన వనరుగా భావించి పొదుపుగా వినియోగించడం, భూగర్భ జలాలను కాపాడడం, నీటి వృథాను నివారించడం వంటి అంశాలపై విద్యార్థులకు అధికారులు వివరించారు. నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది కలిసి జల వనరులను పరిరక్షించేందుకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తూ "నీటి పొదుపు -- మన బాధ్యత" అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల ద్వారా విద్యార్థుల్లో నీటి విలువపై మరింత అవగాహన పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి ప్రభాకర్, నారాయణ, కామేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుమ్మడిదలలో ఉచిత మెగా వైద్య శిబిరం..

### ప్రజలకు నిపుణుల వైద్య సేవలు

### మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ చేత ప్రారంభం

### ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ.. విశేషంగా తరలివచ్చిన ప్రజలు



**గుమ్మడిదల, జూలై 17 ( నేటి ప్రస్థానం ):** గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం అలవి హాస్పిటల్, ఐడీపీఎల్ ఆధ్వర్యంలో, గుమ్మడిదల మున్సిపాలిటీ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ, ఇటువంటి ఉచిత వైద్య శిబిరాల నిర్వహణకు మున్సిపాలిటీ నిరంతరం సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు ప్రజలకు వైద్య సేవలు అందించారు. డా. ఎం. చంద్రశేఖర్ (ఎం.డి.), డా. ఎం. ప్రదీప్ రెడ్డి (పిల్లల వైద్య నిపుణుడు), డా. బి. కళ్యాణి (గైనకాలజిస్ట్), డా. ఎం. శ్రీనివాస్ రావు (ఫంక్షనల్ మెడిసిన్, రుమటాలజీ నిపుణుడు), డా. హరి కిషోర్ (ఆర్థోపెడిక్ నిపుణుడు), డా. మాధురి (న్యూరాలజిస్ట్), డా. వైష్ణవ్ ధర్మపురి, డా. కోమలి (గైనకాలజిస్ట్) రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, వార్డు కౌన్సిలర్లు ఆకుల మాధవి, రమేష్, కుమార్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు ఫయిజ్ , నాయకులు వెంకట్రాం రెడ్డి, సత్యనారా యణ, శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు ఆధునికీకరణకు చర్యలు

### బొంతపల్లిలో అగ్నిప్రమాదం జరిగిన డంపింగ్ యార్డును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్


### శాస్త్రీయ విధానంలో చెత్త నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు: భవిష్యత్‌లో ప్రమాదాలు నివారిస్తామని వెల్లడి



**గుమ్మడిదల, జూలై 17 ( నేటి ప్రస్థానం ):** మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసి, శాస్త్రీయ విధానంలో ఘన వ్యర్థాల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడతామని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. బొంతపల్లి గ్రామంలోని డంపింగ్ యార్డులో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం నేపథ్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దశరథ్‌తో కలిసి ఆయన ఘటనాస్థలిని పరిశీలించారు.ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో నెలకొన్న పరిస్థితులు, అగ్నిప్రమాదానికి దారితీసిన కారణాలు, ప్రస్తుతం చేపడుతున్న నివారణ చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే మున్సిపాలిటీ లక్ష్యమని తెలిపారు.డంపింగ్ యార్డులో చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వేరు చేసి నిర్వహించేలా ఆధునిక సదుపాయాలతో కూడిన ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించి, భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేస్తామని పేర్కొన్నారు.మున్సిపాలిటీ అభివృద్ధి, పారిశుధ్య వ్యవస్థ బలోపేతం, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఎలాంటి రాజీ ఉండదని, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య, వార్డు కౌన్సిలర్లు కుమార్ గౌడ్, రమేష్, కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, వేణు, సత్యనారాయణ, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, వడ్డే గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో 'వందేమాతరం'కు చట్టబద్ధ రక్షణ?

### అవమానిస్తే మూడేళ్ల జైలు శిక్షకు ప్రతిపాదన.. వర్షాకాల సమావేశాల్లో సవరణ బిల్లు వచ్చే అవకాశం



**న్యూఢిల్లీ, జూలై 17:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వాటిలో అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్న 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు--2026' కూడా ఉండే అవకాశమున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే, 'వందేమాతరం' గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించడం, ఆలపించడాన్ని లేదా వాయించడాన్ని అడ్డుకోవడం శిక్షార్హమైన నేరంగా పరిగణించే అవకాశం ఉంది. ప్రతిపాదిత సవరణ ప్రకారం, ప్రస్తుతం జాతీయ గీతం లి'జనగణమన'కు ఉన్న చట్టపరమైన రక్షణ తరహాలోనే లి'వందేమాతరం'లిలికు కూడా ప్రత్యేక రక్షణ కల్పించాలనే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశముందని చర్చ జరుగుతోంది. అయితే దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇప్పటికే ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని ఆలపించడం, వాయించడం గురించి కేంద్రం రాష్ట్రాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పుడు అదే అంశానికి చట్టబద్ధత కల్పించే దిశగా సవరణ బిల్లు తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లుతో పాటు ఆదాయపు పన్ను చట్ట సవరణలు, న్యాయవ్యవస్థకు సంబంధించిన పలు కీలక బిల్లులను కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశమున్నట్లు సమాచారం. ఈ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం లభిస్తే, జాతీయ పతాకం, జాతీయ గీతం, రాజ్యాంగం వంటి జాతీయ చిహ్నాలకు ప్రస్తుతం ఉన్న చట్టపరమైన రక్షణ మాదిరిగానే లి'వందేమాతరం'లికు కూడా ప్రత్యేక చట్టబద్ధ రక్షణ లభించే అవకాశం ఉంది. అయితే బిల్లు అధికారికంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, దాని పూర్తి పాఠ్యాన్ని విడుదల చేసిన తర్వాతే తుది నిబంధనలు, శిక్షల స్వరూపం, అమలు విధానంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన రాజకీయ, న్యాయ, రాజ్యాంగ పరంగా విస్తృత చర్చకు దారితీసే అంశంగా మారుతోంది.



# ఓటరు జాబితాలో పేరు లేకపోతే పౌరసత్వం పోతుందా? సుప్రీంకోర్టు స్పష్టీకరణ

### ఓటు హక్కు కోల్పోవడం వేరు.. పౌరసత్వం కోల్పోవడం వేరు: సర్వోన్నత న్యాయస్థానం

### పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం ఎన్నికల సంఘానికి లేదని వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూలై 17:** ఓటరు జాబితాలో పేరు లేకపోవడం వల్ల ఎవరూ భారత పౌరసత్వాన్ని కోల్పోరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించడం అనేది కేవలం ఆ వ్యక్తికి ఓటు హక్కు లేదని మాత్రమే సూచిస్తుందని, అది పౌరసత్వాన్ని రద్దు చేసినట్లుగా పరిగణించరాదని తేల్చిచెప్పింది.పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) ప్రక్రియకు సంబంధించి దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

**ఈసీకి పౌరసత్వం నిర్ణయించే అధికారం లేదు**

ఒక వ్యక్తి భారత పౌరుడా? కాదా? అనే అంశాన్ని తుది నిర్ణయించే అధికారం భారత ఎన్నికల సంఘానికి (జుజ×) లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల జాబితా తయారీ, సవరణ ప్రక్రియలో భాగంగా మాత్రమే ఈసీ తన అధికారాలను వినియోగిస్తుందని, పౌరసత్వంపై తుది నిర్ణయం తీసుకునే సంస్థ కాదని పేర్కొంది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించబడినంత మాత్రాన ఆ వ్యక్తి భారత పౌరుడు కాదని చెప్పలేమని, పౌరసత్వం చెల్లదని కూడా భావించరాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**బీహార్ SIR తీర్పును ప్రస్తావించిన ధర్మాసనం**

బీహార్‌లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కేసులోనూ ఇదే అంశాన్ని స్పష్టం చేశామని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఓటరు జాబితా నుంచి తొలగింపునకు గురైన వారు చట్టపరంగా అప్పీల్ చేసుకునే అవకాశం ఉండాలని, పారదర్శకమైన విధానం పాటించాలని కోర్టు సూచించింది.

**పశ్చిమ బెంగాల్ పిటిషన్ విచారణ**

ఎస్ఐఆర్ ప్రక్రియలో పేర్లు తొలగించబడిన వ్యక్తుల అప్పీళ్లను విచారిస్తున్న అప్పీలేట్ ట్రిబ్యునళ్ల పనితీరును క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది.

**సంక్షేమ పథకాల నిలిపివేతపై ఆందోళన**

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదన ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ (ూణూ), అన్నపూర్ణ యోజన వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిలిపివేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కుల ధ్రువీకరణ పత్రాల జారీని కూడా నిరాకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాలపై కూడా సుప్రీంకోర్టు విచారణ కొనసాగించాలని నిర్ణయించింది.

**34 లక్షల అప్పీలు పెండింగ్**

విచారణ సందర్భంగా సమర్పించిన వివరాల ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో పేర్లు తొలగించబడిన వారిలో సుమారు 34 లక్షల అప్పీలు 19 అప్పీలేట్ ట్రిబ్యునళ్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు సుమారు 38 వేల అప్పీలు మాత్రమే పరిష్కరించగా, వాటిలో దాదాపు 70 శాతం అప్పీలను అనుమతించినట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

**సుప్రీంకోర్టు స్పష్టీకరణతో క్లారిటీ**

ఓటరు జాబితాలో పేరు లేకపోతే పౌరసత్వం కూడా పోతుందనే ప్రచారానికి సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు స్పష్టతనిచ్చాయి. ఓటు హక్కు, పౌరసత్వం రెండూ వేర్వేరు అంశాలని, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించబడిన వ్యక్తి పౌరసత్వంపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ఎన్నికల సంఘానికి లేదని సర్వోన్నత న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది.

# మూసీ అభివృద్ధికి భూములిస్తాం.. కానీ న్యాయమైన పరిహారం కావాలి

### హైదర్‌గూడ భూ బాధితుల ఆవేదన.. 'డబ్బు కాదు.. మా జీవితాల ప్రశ్న'

### గజానికి రూ.51 వేలు లేదా ఎకరానికి రూ.20 కోట్ల పరిహారం

### ఆఫర్ చేసిన అధికారులు.. త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచన

**బండ్లగూడ, జూలై 17 (ప్రత్యేక ప్రతినిధి):**

"తరతరాలుగా సాగు చేస్తున్న భూమి మా జీవనాధారం. ఇప్పుడు ఆ భూమి పోతే మా కుటుంబాల భవిష్యత్తు ఏమవుతుంది? పరిహారం ఇచ్చినా.. మళ్లీ అదే స్థాయిలో భూమి కొనగలమా?" అంటూ మూసీ అభివృద్ధి ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులు, భూ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.మూసీ నది పునరుజ్జీవనం, గాంధీ సరోవర్ నిర్మాణం, నదీ తీరాల సుందరీకరణ, వరద నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న తొలి దశ భూ సేకరణ ప్రక్రియ రాజేంద్రనగర్ మండలంలోని హైదర్‌గూడ గ్రామంలో కీలక దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో మూసీ అభివృద్ధి శాఖ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్ ఆధ్వర్యంలో భూ బాధితులతో సమావేశం నిర్వహించారు.



**30 ఎకరాల భూమి సేకరణకు చర్యలు**

మొదటి దశలో హైదర్‌గూడ గ్రామ పరిధిలోని సుమారు 30 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించనుంది. ఈ భూమిలో వ్యవసాయ భూములతో పాటు నివాస, వాణిజ్య అవసరాలకు అనువైన స్థలాలు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**పరిహారంపై అధికారుల ప్రతిపాదన**

- భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం రెండు ప్రత్యామ్నాయాలను సూచించింది.
- గజానికి రూ.51 వేల చొప్పున పరిహారం.
- లేదా ఎకరానికి గరిష్ఠంగా రూ.20 కోట్ల వరకు పరిహారం.
- ఈ రెండు విధానాల్లో ఏది అనుకూలమో నిర్ణయించి త్వరగా తెలియజేయాలని అధికారులు బాధితులను కోరారు. అంగీకారం లభించకపోయినా చట్టపరమైన ప్రక్రియ ప్రకారం పరిహార మొత్తాన్ని కోర్టులో జమ చేసి భూ సేకరణ చేపట్టాల్సి వస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

**'డబ్బు ఇస్తే సరిపోదు' అంటున్న బాధితులు**

అయితే అధికారుల ప్రతిపాదనపై భూ బాధితులు పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేయలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మార్కెట్ విలువ ప్రభుత్వ ప్రతిపాదన కంటే ఎక్కువగా ఉందని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర విస్తరణతో హైదర్‌గూడ, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరిగాయని, ప్రస్తుతం పరిహారం తీసుకున్నా అదే ప్రాంతంలో మళ్లీ భూమి కొనుగోలు చేయడం అసాధ్యమని వారు తెలిపారు. "భూమి ఒక్క ఆస్తి కాదు... అది మా జీవనాధారం. భూమి కోల్పోయిన తర్వాత మా పిల్లల భవిష్యత్తు, జీవనోపాధిపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి" అని బాధితులు కోరారు.

**పునరావాసంపైనా స్పష్టత కోరిన రైతులు**

పరిహారంతో పాటు పునరావాసం, ఉపాధి, ఇతర సంక్షేమ అంశాలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సమావేశంలో బాధితులు కోరారు.

**వారి ప్రధాన డిమాండ్లు:**

- మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం నిర్ణయించాలి.
- ప్రతి భూ యజమానితో వ్యక్తిగతంగా చర్చలు జరపాలి.
- పునరావాస కాలనీలపై స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలి.
- జీవనోపాధి కోల్పోయే కుటుంబాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి.
- భూమిపై ఆధారపడిన కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు కూడా న్యాయం చేయాలి.
- కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- పరిహారం చెల్లింపులో ఆలస్యం లేకుండా చూడాలి.

**మూసీ అభివృద్ధి ఎందుకు?**

మూసీ నది పునరుద్ధరణకు ప్రభుత్వం భారీ ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా...

- నది వెడల్పు పెంపు.
- వరద నియంత్రణ చర్యలు.
- గాంధీ సరోవర్ నిర్మాణం.
- నదీ తీరాల సుందరీకరణ.
- పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు.
- మురుగు నీటి శుద్ధి కేంద్రాలు.
- పర్యాటక అభివృద్ధి.
- హరిత వాతావరణం కల్పించడం వంటి పనులు చేపట్టనున్నారు.
- ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నగరానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రజల సహకారం కోరిన అధికారులు**

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. భూ యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే పరిహారం చెల్లింపులు త్వరగా పూర్తి చేసి ప్రాజెక్టును వేగవంతం చేయవచ్చని తెలిపారు. అన్ని అభ్యంతరాలు, సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తుందని, చట్టబద్ధంగా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**భూ బాధితుల సందేహాలు ఇంకా వీడలేదు**

అయితే సమావేశం అనంతరం కూడా భూ యజమానుల్లో అనేక సందేహాలు కొనసాగుతున్నాయి. పరిహారం చెల్లింపు విధానం, భూముల విలువ నిర్ణయించే ప్రమాణాలు, పునరావాసం, భవిష్యత్ భద్రత వ టి అంశాలపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

మూసీ అభివృద్ధి ప్రాజెక్టు హైదరాబాద్ భవిష్యత్తుకు కీలకమైనదేనని అంగీకరిస్తూనే, అభివృద్ధి పేరుతో భూములు కోల్పోతున్న కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా ప్రభుత్వం వ్యవహరించాలని భూ బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సర్ ప్రక్రియలో గందరగోళం..

### 100% పంపిణీ అంటున్న అధికారులు, క్షేత్రస్థాయిలో మాత్రం భిన్న పరిస్థితులు

### హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లో పూర్తి పంపిణీగా వెబ్‌సైట్‌లో నమోదు

### చాలా ప్రాంతాల్లో సగం మంది ఓటర్లకూ చేరని ఎన్యుమరేషన్ ఫారాలు

### డిజిటలైజేషన్ 50 శాతానికీ చేరకపోవడంపై అనుమానాలు



**హైదరాబాద్, జూలై 17 (ప్రత్యేక ప్రతినిధి):** ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో గందరగోళంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ వంద శాతం పూర్తయినట్లు నమోదు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం చాలా మంది ఓటర్లకు ఇప్పటికీ ఫారాలు అందలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక లెక్కలు, వాస్తవ పరిస్థితుల మధ్య తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోందని ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం, అనేక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇప్పటికీ 50 శాతం మందికీ ఫారాలు పంపిణీ కాలేదని స్థానికులు చెబుతున్నారు. అయితే సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఫారాలను తమ వద్దే ఉంచుకుని, పంపిణీ పూర్తయినట్లు యాప్‌లో నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎన్నికల సంఘం పోర్టల్‌లో వంద శాతం పంపిణీ పూర్తయినట్లు నమోదవుతోందని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఓటరు ఇంటికి కనీసం మూడు సార్లు వెళ్లి ఫారాలు అందించాల్సి ఉండగా, కొంతమంది బీఎల్‌వోలు ఓటర్లనే తమ వద్దకు రావాలని సూచిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ముందుగానే ఫారాలను స్కాన్ చేసి, పంపిణీ పూర్తయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు చేయకుండా యాప్‌లో నమోదైన వివరాలనే ఆధారంగా తీసుకుని అధికారిక గణాంకాలు ప్రకటిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫారాలు అందకుండానే పంపిణీ పూర్తయిందని ప్రకటించడంతో తమ ఓటు హక్కుపై ప్రభావం పడుతుందేమోనని పలువురు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. బీఎల్‌వోల పనితీరుపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రతి ఓటరికి ఫారం అందేలా పర్యవేక్షించాలని వారు కోరుతున్నారు.

**అవగాహన లేమితో అయోమయం**

ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించినప్పటికీ, ఇంకా అనేక మంది ఓటర్లకు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కొందరికి ఫారాలే అందకపోగా, మరికొందరికి వాటిని ఎలా నింపాలో తెలియక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నింపిన ఫారాలను బీఎల్‌వోలు ఇంటికి వచ్చి తీసుకెళతారనే ఆశతో తమ వద్దే ఉంచుకున్న వారు కూడా ఉన్నారు. గ్రేటర్ పరిధిలో ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లకు స్పందన తక్కువగా ఉండగా, రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల వద్ద మాత్రం ఓటర్ల రద్దీ కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో బీఎల్‌వోలకే ప్రక్రియపై సరైన అవగాహన లేక ఓటర్లతో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**పంపిణీ 100%... డిజిటలైజేషన్ మాత్రం నత్తనడకన**

ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయినట్లు చూపుతున్నప్పటికీ, డిజిటలైజేషన్ ప్రక్రియ మాత్రం చాలా నెమ్మదిగా సాగుతోంది. గురువారం నాటికి హైదరాబాద్ జిల్లాలో డిజిటలైజేషన్ 31.5 శాతం, రంగారెడ్డి జిల్లాలో 41.4 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కేవలం 28.41 శాతం మాత్రమే నమోదైంది. పంపిణీ నిజంగానే వంద శాతం పూర్తయి ఉంటే, డిజిటలైజేషన్ కూడా అదే స్థాయిలో పురోగతి సాధించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా గణాంకాలు ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) ద్వారా ఓటర్లకు సహకరిస్తూ నింపిన ఫారాలను సేకరిస్తున్నప్పటికీ, డిజిటలైజేషన్ వేగం పెరగకపోవడం ప్రశ్నలకు తావిస్తోంది.ఎన్నికల సంఘం క్షేత్రస్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, బీఎల్‌వోల పనితీరును సమీక్షించడంతో పాటు ప్రతి అర్హ ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# మాన్‌సూన్ ముసుగులో దందా..!



## వానలు రాకముందే కాసుల వర్షం? హైడ్రా మాన్‌సూన్ పనుల్లో నిబంధనల ఉల్లంఘనలపై తీవ్ర ఆరోపణలు

## రూ.85 కోట్ల పనులపై ప్రశ్నలు.. 8 ఏజెన్సీలకే మెజార్టీ టెండర్లు.. మూడు షిఫ్టుల పేరుతో ఒకే షిఫ్ట్ నిర్వహణ?

## మ్యానువల్ బిల్లింగ్‌పై విమర్శలు.. పారదర్శకతపై సందేహాలు.. సమగ్ర విచారణకు డిమాండ్

**హైదరాబాద్, జూలై 17 (ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ, హైడ్రా (న్‌ఆ=ూాా) అమలు చేస్తున్న మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ పనులపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వరద ముంపు నివారణ, అత్యవసర చర్యల పేరుతో చేపట్టిన పనుల్లో టెండర్ నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు, పనుల అమలు నుంచి బిల్లుల చెల్లింపుల వరకు పారదర్శకత లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వానలు కురిసేలోపే కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల కోసం ఒత్తిళ్లు తెస్తున్నారనే ఆరోపణలు కూడా చర్చనీయాంశమయ్యాయి.

**రూ.85 కోట్ల పనులు.. ఎనిమిది ఏజెన్సీలకే మెజార్టీ**

వరద ముంపు నివారణ, అత్యవసర సేవల కోసం గత నెలలో హైడ్రా 62 ప్రాంతాల్లో ఎమర్జెన్సీ మెయింటెనెన్స్ (వీజు) పనులకు దాదాపు రూ.85 కోట్ల విలువైన టెండర్లు ఆహ్వానించింది. అయితే వీటిలో సుమారు 40 సర్కిళ్ల పనులు కేవలం ఎనిమిది ఏజెన్సీలకే దక్కడం అప్పట్లోనే విమర్శలకు దారితీసింది. టెండర్లు ఖరారైనప్పటికీ అన్ని ఏజెన్సీలతో ఒప్పందాలు పూర్తికాకముందే పనులు ప్రారంభించారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు నాలుగు చోట్ల పనుల్లో నిర్లక్ష్యం కారణంగా టెండర్లు రద్దు చేసినప్పటికీ, మళ్లీ అదే పాత ఏజెన్సీల్లో ముగ్గురికే పనులు అప్పగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**కాగితాలపై మూడు షిఫ్టులు.. క్షేత్రస్థాయిలో ఒక్కటే?**

టెండర్ నిబంధనల ప్రకారం వర్షాకాలమంతా 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో అత్యవసర సిబ్బంది అందుబాటులో ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో చాలా చోట్ల ఒక్క షిఫ్టు మాత్రమే నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగిలిన రెండు షిఫ్టుల పేరుతో బిల్లులు చూపిస్తూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒకే బృందంతో అదనపు గంటలు పనిచేయించడం వల్ల కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని కూడా కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

**మహిళలతో ప్రమాదకర పనులు?**

టెండర్ నిబంధనల ప్రకారం ప్రమాదకర పనులకు శిక్షణ పొందిన నైపుణ్య కార్మికులను మాత్రమే వినియోగించాలి. అయితే జిల్లెలగూడ సహా కొన్ని ప్రాంతాల్లో మహిళా కార్మికులతోనూ డ్రైనేజీ, మురుగు కాల్వల పనులు చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో భద్రతా పరికరాలు లేకుండా మహిళలను పనుల్లోకి దించడం కార్మిక చట్టాలకు విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పర్యవేక్షణ ఎక్కడ?**

ప్రతి వార్డులో కనీసం 12 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉండగా, అనేక చోట్ల ముగ్గురు లేదా నలుగురితోనే పనులు సాగుతున్నాయని సమాచారం.

క్షేత్రస్థాయిలో ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు? హాజరు ఎలా ఉంది? పనుల నాణ్యత ఎలా ఉంది? వంటి వివరాలపై ఉన్నతాధికారుల వద్ద సరైన సమాచారం లేకపోవడం పర్యవేక్షణలో లోపాలను బయటపెడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. హైడ్రాకు పనులు అప్పగించిన తర్వాత స్థానిక మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ తగ్గిపోవడంతో కాంట్రాక్టర్లు నిబంధనలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**మ్యానువల్ బిల్లింగ్‌పై అనుమానాలు**

మరోవైపు బిల్లుల చెల్లింపుల వ్యవస్థపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని చాలా ప్రభుత్వ శాఖల్లో వర్క్ మేనేజ్‌మెంట్ సిస్టం (WMS), ఈఆర్‌పీ (ERP) ద్వారా ఆన్‌లైన్‌లో పారదర్శకంగా బిల్లులు చెల్లిస్తుండగా, హైడ్రాలో మాత్రం ఇప్పటికీ మ్యానువల్ విధానంలో బిల్లులు మంజూరు చేస్తున్నట్లు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.డైరెక్ట్ చెక్కులు లేదా ఆర్టీజీఎస్ ద్వారా చెల్లింపులు జరగడం వల్ల ఆడిట్ ట్రైల్ బలహీనపడుతుందని, దీనివల్ల జవాబుదారీతనం తగ్గే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

**ఈఆర్‌పీ లేకుంటే అక్రమాలకు అవకాశం?**

నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈఆర్‌పీ విధానంలో ప్రతి బిల్లుకు ప్రత్యేక ఈఆర్పీ నంబర్ నమోదవుతుంది. ఏళ్ల తర్వాత కూడా రికార్డులు అందుబాటులో ఉంటాయి.

**మ్యానువల్ బిల్లింగ్‌లో మాత్రం...**

ఒకే పనికి రెండుసార్లు చెల్లింపులు, నకిలీ బిల్లులు,రికార్డుల మాయం,చెల్లింపుల ట్రాకింగ్‌లో లోపాలు వంటి అక్రమాలకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

**కాంట్రాక్టర్ల అసంతృప్తి**

జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేసే పలువురు కాంట్రాక్టర్లు ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీలో అన్ని చెల్లింపులు ఆన్‌లైన్ విధానంలో జరుగుతుండగా, హైడ్రాలో మాత్రం భిన్న విధానం అనుసరించడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం అన్ని శాఖల్లో ఒకే విధమైన పారదర్శక చెల్లింపు విధానాన్ని అమలు చేయాలని వారు కోరుతున్నారు.

**విచారణకు డిమాండ్**

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ పనుల్లో టెండర్ల కేటాయింపు, కార్మికుల నియామకం, మూడు షిఫ్టుల అమలు, బిల్లుల చెల్లింపులు, మ్యానువల్ బిల్లింగ్ విధానం తదితర అంశాలపై స్వతంత్రంగా సమగ్ర విచారణ చేపట్టాలని కాంట్రాక్టర్లు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై హైడ్రా అధికారుల అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఆరోపణలపై స్పష్టత ఇచ్చి, అవసరమైతే విచారణ నిర్వహిస్తేనే ప్రజల్లో నెలకొన్న సందేహాలు నివృత్తి అవుతాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రజా సమస్యలపై రాజీ లేదు... ప్రభుత్వ భూముల రక్షణే మా లక్ష్యం

### అన్నారం--261లో అక్రమాలపై పోరాటం కొనసాగుతుంది: గుమ్మడిదల మెజారిటీ కౌన్సిలర్లు

### ప్రజా సమస్యలపై పార్టీలకు అతీతంగా ఉద్యమిస్తాం

### అన్నారం--261లో జరిగిన అక్రమాలన్నింటినీ గ్రామసభలో ఆధారాలతో బయటపెడతాం

### ప్రజా ప్రతినిధులను అడ్డుకునే వారిని ప్రజల ముందే నిలదీస్తాం

### మున్సిపాలిటీ వ్యాప్తంగా అన్యాయాలు, అక్రమాలపై ఉద్యమం కొనసాగుతుంది





**గుమ్మడిదల, జూలై 17 ( నేటి ప్రస్థానం ):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మెజారిటీ వార్డు కౌన్సిలర్లు శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారం--261లో చోటుచేసుకున్న పరిణామాలపై తమ వైఖరిని స్పష్టం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఏకైక లక్ష్యమని వెల్లడించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల నిరోధం, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ప్రజా సమస్యలు ఎదురైనా రాజకీయాలకు అతీతంగా ప్రజల తరఫున ముందుండి పోరాడతామని తెలిపారు. మంగళవారం అన్నారం--261లో మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పరిశ్రమ ప్రహరీ గోడను మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందేనన్నారు. ఈ వ్యవహారంలో పరిశ్రమ యాజమాన్యం పూర్తి వివరాలు ఇస్తామని హామీ ఇచ్చి, అనంతరం స్పందించకపోవడంతో సంబంధిత అధికారులతో కలిసి వివరణ కోరేందుకు గురువారం వెళ్లామని తెలిపారు. అయితే అక్కడ కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, ప్రజా ప్రతినిధుల విధులకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. తాము ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజా ప్రయోజనాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసమే ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని కౌన్సిలర్లు స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా, ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని, అందుకే అన్నారం--261 అంశంపై వెనక్కి తగ్గకుండా పోరాటం చేస్తున్నామని తెలిపారు. అలాగే, మున్సిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కొందరు నాయకులు తమ గ్రామాలకు సంబంధం లేకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇతర గ్రామాల్లో పదవులు పొందుతూ, ఇప్పుడు సొంత లబ్ది కోసమే ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల చేత ఎన్నికైన తమలాంటి ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తుంటే అడ్డుకోవడం, దురుసుగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

**అన్నారం వేదికగా అక్రమాలపై బహిరంగ బహిర్గతం**

అన్నారం గ్రామంలో గతంలో చోటుచేసుకున్న భూ ఆక్రమణలు, భూ కుంభకోణాలు, కొన్ని వర్గాల ప్రజల భూములను అన్యాక్రాంతం చేసిందేవరో,ఇతర అక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో నిర్వహించనున్న గ్రామసభలో ప్రజల ముందుంచుతామని కౌన్సిలర్లు హెచ్చరించారు. ఎవరు ఏ విధంగా అక్రమాలకు పాల్పడ్డారో ఆధారాలతో సహా వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

**అక్రమాలకు అండగా నిలిచే వారిని ప్రజల ముందే నిలదీస్తాం**

మున్సిపాలిటీ వ్యాప్తంగా జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నిస్తున్న తమలాంటి ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని, గ్రామాల పేరుతో ముసుగు వేసుకొని అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న వారి అసలు స్వరూపాన్ని కూడా ప్రజలకు తెలియజేస్తామని అన్నారు. త్వరలో నిర్వహించనున్న బహిరంగ ప్రజాసభలో అన్ని అంశాలపై పూర్తి వివరాలతో ప్రజల ముందుకు వస్తామని, ప్రజలే వాస్తవాలను నిర్ణయిస్తారని సవాల్ విసిరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా ప్రయోజనాల సాధన, అక్రమాల నిర్మూలనే మా లక్ష్యం. అన్నారం--261తో మా పోరాటం ముగియదు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ప్రజా సమస్యలు, అక్రమాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగినా ప్రజల తరఫున ముందుండి పోరాడుతామని మెజారిటీ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. ఈ సమావేశం లో వార్డు కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, రాజశేఖర్, మురళి, చక్రపాణి, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, జైపాల్ రెడ్డి, కిషన్, విజయలక్ష్మి, సోనీ, వరలక్ష్మి, నిర్మల,పద్మ నాయకులు శేఖర్ రెడ్డి,వేణు గోపాల్, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.






# యూపీఐ ట్రాన్సాక్షన్లపై ఛార్జీలు వస్తాయా?..

## పెద్ద వ్యాపారులకు మాత్రమే మర్చంట్ ఫీజుపై కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అయితే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లుగా సాధారణ వినియోగదారులపై నేరుగా ట్రాన్సాక్షన్ ఛార్జీలు విధించే నిర్ణయం ఇప్పటివరకు తీసుకోలేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, సంబంధిత వర్గాలు పెద్ద వ్యాపార సంస్థలకు వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ అమలుపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం యూపీఐ ద్వారా జరిగే లావాదేవీలపై జీరో ఎండీఆర్ విధానం అమల్లో ఉంది. దీంతో వినియోగదారులు ఎలాంటి అదనపు రుసుము లేకుండా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. అయితే ఈ విధానం కారణంగా బ్యాంకులు, యూపీఐ సేవలు అందించే సంస్థలకు స్థిరమైన ఆదాయం లేకపోవడంతో, పెద్ద వ్యాపారులపై పరిమిత మర్చంట్ ఛార్జీలు విధించే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

**పెద్ద వ్యాపారులకే పరిమితం?**

ప్రతిపాదన ప్రకారం, వార్షిక టర్నోవర్ రూ.40 లక్షలకు పైగా ఉన్న వ్యాపార సంస్థలకే మర్చంట్ ఫీజు వర్తించే అవకాశం ఉందని సమాచారం. రూ.10 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 5 నుంచి 7 బేసిస్ పాయింట్ల మేర ఎండీఆర్ విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఛార్జీలను సాధారణంగా వినియోగదారులు కాకుండా వ్యాపార సంస్థలే భరించే విధానం ఉండే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు చెబుతున్నాయి.

**ఇంకా అధికారిక నిర్ణయం లేదు**

ఈ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. దీనిపై తుది నిర్ణయం వెలువడిన తర్వాతే కొత్త విధానం అమల్లోకి రానుంది. ఇప్పటివరకు ప్రభుత్వం లేదా భారతీయ రిజర్వ్ బ్యాంక్ నుంచి అన్ని యూపీఐ వినియోగదారులపై ట్రాన్సాక్షన్ ఛార్జీలు విధిస్తున్నట్లు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

### ఎందుకు ఈ ప్రతిపాదన?

జనవరి 2020 నుంచి యూపీఐ చెల్లింపులపై జీరో ఎండీఆర్ అమల్లో ఉండటంతో, డిజిటల్ చెల్లింపు సేవలు అందించే సంస్థలకు ప్రత్యక్ష ఆదాయం తగ్గింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా నిర్వహణ ఖర్చులకు పూర్తిగా సరిపోవడం లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో యూపీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి పెద్ద వ్యాపారుల నుంచి పరిమిత మర్చంట్ ఛార్జీలు వసూలు చేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# ఒక్క నెలలోనే రూ.2,500 అదనపు భారం..!

## కూరగాయల నుంచి కిరాణా వరకు.. నిత్యావసర ధరల మోతతో విలవిల్లాడుతున్న సామాన్యుడు

## వర్షాభావం.. యుద్ధ ప్రభావం.. రవాణా ఖర్చుల పెరుగుదలతో ఆకాశాన్నంటిన ధరలు

ప్రత్యేక కథనం

హైదరాబాద్: ఉదయం మార్కెట్‌కు వెళ్లిన ప్రతి గృహిణి చేతిలో అదే ప్రశ్న.. "నిన్న రూ.150లో వచ్చిన సరుకులు.. ఈరోజు రూ.250 ఎలా అయ్యాయి?" కూరగాయలు, కిరాణా సరుకులు, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్... ఇలా ఇంటి నిర్వహణకు అవసరమైన దాదాపు ప్రతి వస్తువు ధర ఒక్క నెల వ్యవధిలోనే భారీగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ పూర్తిగా తారుమారైంది. ఇప్పటికే ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, పిల్లల విద్యా ఖర్చులు, వైద్య వ్యయాలతో సతమతమవుతున్న కుటుంబాలకు ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల మరో గట్టి దెబ్బగా మారింది. మార్కెట్‌కు వెళ్లే ప్రతి ఒక్కరూ ధరలు చూసి వెనుదిరిగే పరిస్థితి ఏర్పడింది.

**ఎందుకు పెరుగుతున్నాయి ధరలు?**

- ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, ధరల పెరుగుదలకు ఒకటి కాదు.. అనేక కారణాలు కలిసి పనిచేస్తున్నాయి.
- పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలపై ఒత్తిడి.
- దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ దిగుబడులు తగ్గడం.
- సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో మార్కెట్‌కు వస్తున్న ఉత్పత్తుల కొరత.
- పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో రవాణా వ్యయం పెరగడం.
- హోల్‌సేల్ మార్కెట్లలో కొనుగోలు ధరలు పెరగడంతో రిటైల్ ధరలు మరింత ఎగబాకడం.
- ఈ అంశాలన్నీ కలిసి నిత్యావసర వస్తువుల ధరలను ఒకేసారి పెంచాయని వ్యాపారులు చెబుతున్నారు.
- కూరగాయల నుంచి పప్పుల వరకు.. అన్నింటికీ మంట గత నెల వరకు అందుబాటులో ఉన్న కూరగాయలు ఇప్పుడు సామాన్యుడికి భారంగా మారాయి. ముఖ్యంగా అల్లం, వెల్లుల్లి, ఎండుమిర్చి, ఉల్లి, పచ్చిమిర్చి ధరలు భారీగా పెరిగాయి. ఇదే సమయంలో మినపప్పు, చక్కెర, చింతపండు వంటి కిరాణా వస్తువుల ధరలు కూడా పెరగడంతో వంటింటి ఖర్చు అమాంతం పెరిగింది. బియ్యం ధరలు కూడా పెరుగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. స్థానిక వ్యాపారుల సమాచారం ప్రకారం, గత నెలలో క్వింటాల్‌కు సుమారు రూ.1,300 ఉన్న కొన్ని రకాల బియ్యం ప్రస్తుతం రూ.1,600 వరకు చేరినట్లు చెబుతున్నారు.



### ఒక్క నెలలో పెరిగిన ధరలు

| వస్తువు | జూన్ తొలి వారం (రూ.) | ప్రస్తుతం (రూ.) |
|---|---|---|
| అల్లం | 140-210 | 230 |
| వెల్లుల్లి | 140-160 | 210-450 |
| ఎండుమిర్చి | 230-245 | 320 |
| చింతపండు | 140 | 180 |
| పచ్చ జొన్నలు | 55-60 | 75 |
| తెల్ల జొన్నలు | 35-40 | 55 |
| మినపప్పు | 110 | 140 |
| చక్కెర | 42 | 48 |
| ఉల్లిగడ్డ | 22 | 35 |
| మొరంగడ్డ | 25 | 33 |
| పచ్చిమిర్చి | 45 | 55 |

**నెలవారీ బడ్జెట్‌కు గండి**

ఇప్పటికే స్థిరమైన ఆదాయంతో జీవిస్తున్న మధ్యతరగతి కుటుంబాలకు ఈ ధరల పెరుగుదల తీవ్ర భారంగా మారింది. నలుగురు సభ్యుల కుటుంబానికి గత నెలతో పోలిస్తే ప్రస్తుతం నెలకు దాదాపు రూ.2,000 నుంచి రూ.2,500 వరకు అదనపు ఖర్చు అవుతోందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు, విద్యుత్ బిల్లులు, రవాణా ఖర్చులు ఇప్పటికే పెరిగిన పరిస్థితుల్లో ఇప్పుడు వంటింటి ఖర్చు కూడా పెరగడంతో కుటుంబాల పొదుపు పూర్తిగా తగ్గిపోతోందని వారు పేర్కొంటున్నారు.

**ప్రజల ఆవేదన**

"జీతం మాత్రం పెరగడం లేదు.. కానీ ప్రతి వారం మార్కెట్‌కు వెళ్లినప్పుడల్లా కొత్త ధరలు కనిపిస్తున్నాయి. గత నెలలో రూ.5 వేలలో వచ్చిన కిరాణా ఇప్పుడు రూ.6 వేలకుపైగా అవుతోంది. కూరగాయలు కొనాలంటేనే భయమేస్తోంది" అని పలువురు గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యతరగతి ఉద్యోగులు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నెల ప్రారంభంలో వేసుకున్న బడ్జెట్ నెలాఖరుకు పూర్తిగా దెబ్బతింటోందని చెబుతున్నారు.




## క్రెడిట్ కార్డుతో ఏటీఎంలో

# నగదు తీస్తున్నారా?


### భారీ ఛార్జీలు, వడ్డీ తప్పదు..!

న్యూఢిల్లీ: క్రెడిట్ కార్డును షాపింగ్, ఆన్‌లైన్ చెల్లింపుల కోసం వినియోగించడం సాధారణమే. అయితే అత్యవసర పరిస్థితుల్లో క్రెడిట్ కార్డుతో ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేయడం మాత్రం ఆర్థికంగా భారంగా మారే అవకాశం ఉందని బ్యాంకింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్యాష్ విత్‌డ్రాపై సాధారణ కొనుగోళ్ల మాదిరిగా గ్రేస్ పీరియడ్ ఉండదు. నగదు తీసుకున్న రోజు నుంచే వడ్డీ లెక్కింపు ప్రారంభమవుతుంది. ప్రస్తుతం చాలా బ్యాంకులు క్రెడిట్ కార్డు పరిమితిలో కొంత మొత్తాన్ని ఏటీఎం ద్వారా నగదుగా తీసుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అయితే దీనిపై క్యాష్ అడ్వాన్స్ ఫీజుతో పాటు అధిక వడ్డీ కూడా వసూలు చేస్తాయి. దీంతో చిన్న మొత్తం విత్‌డ్రా చేసినా చివరకు చెల్లించాల్సిన మొత్తం గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది.

**బ్యాంకుల వారీగా ఛార్జీలు**

ప్రధాన బ్యాంకుల నిబంధనల ప్రకారం, క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేస్తే వేర్వేరు రుసుములు అమల్లో ఉన్నాయి.

**యాక్సిస్ బ్యాంక్:** విత్‌డ్రా చేసిన మొత్తంపై 2.5 శాతం లేదా కనిష్ఠంగా రూ.500 క్యాష్ అడ్వాన్స్ ఫీజు. నెలకు 1.05 శాతం నుంచి 3.60 శాతం వరకు వడ్డీ.




**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్:** 2.5 శాతం లేదా కనిష్ఠంగా రూ.500 ఫీజు. నెలకు 1.99 శాతం నుంచి 3.60 శాతం వరకు వడ్డీ.

**ఐసీఐసీఐ బ్యాంక్:** 2.5 శాతం లేదా కనిష్ఠంగా రూ.500 క్యాష్ అడ్వాన్స్ ఫీజు. నెలకు 2.49 శాతం నుంచి 3.67 శాతం వరకు వడ్డీ.

**ఎస్‌బీఐ కార్డ్స్:** 2.5 శాతం లేదా రూ.500 (ఏది ఎక్కువైతే అది) క్యాష్ అడ్వాన్స్ ఫీజు. నెలకు 2.75 శాతం నుంచి 3.50 శాతం వరకు వడ్డీ.

**కోటక్ మహీంద్ర బ్యాంక్:** ప్రతి రూ.10 వేల నగదు విత్‌డ్రాకు రూ.300 క్యాష్ అడ్వాన్స్ ఫీజు. నెలకు 2.49 శాతం నుంచి 3.50 శాతం వరకు వడ్డీ.

**అవసరమైతేనే వినియోగించాలి**

క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. సాధారణ ఖర్చుల కోసం ఈ సదుపాయాన్ని ఉపయోగిస్తే అదనపు ఫీజులు, అధిక వడ్డీ కారణంగా అప్పు భారం పెరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి క్రెడిట్ కార్డును ప్రధానంగా కొనుగోళ్లు, డిజిటల్ చెల్లింపులకే పరిమితం చేయడం ఆర్థికంగా లాభదాయకమని సూచిస్తున్నారు.

## సింక్రోని గ్లోబల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్



హైదరాబాద్: అమెరికాకు చెందిన సింక్రోని ..ప్రపంచంలో అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. 6 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ప్రపంచంలో మూడో అతిపెద్ద సెంటర్ ఇదే కావడం విశేషం. మిగతా రెండు సెంటర్లు అమెరికాలో నెలకొల్పింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రైజెస్ హబ్‌గా కొనసాగుతున్న భారత్‌లో అతిపెద్ద సెంటర్‌ను ఏర్పాటు చేయడం విశేషమని కంపెనీ చీఫ్ టెక్నాలజీ అధికారి ఫ్లోరిన్ అగ్గిరెక్కా తెలిపారు. జఊ ఉ ాాకీష్మీ +ఐఅంవం అంతర్జాతీయ వ్యాపార విస్తరణకు భారత్ కేంద్రంగా మారుతున్నదని, ముఖ్యంగా టెక్నాలజీ, ఆపరేషన్స్, అనలిటిక్స్, మార్కెటింగ్ విభాగాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్నదన్నారు. 6 వేల మందికి పైగా కుర్చోవడానికి వీలుగా డిజైన్ చేసిన ఈ సెంటర్‌తో అంతర్జాతీయంగా ఉన్న క్లయింట్లకు ఇక్కడి నుంచే సేవలు అందించనున్నట్లు తెలిపారు.

# జోరుగా హైదరాబాద్-అమెరికా ప్రయాణాలు

**ఏటా 13 లక్షల మంది రాకపోకలు..**

**విస్తరణలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టే దేశంలో టాప్**

**2031 నాటికి వార్షిక ప్రయాణికులు 5 కోట్లకు**

హైదరాబాద్: ఏటా ఒక్క హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే అమెరికాకు 13 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా అమెరికా వెళ్తున్నవారిలో కూడా అత్యధికులు టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరానికే వెళ్తుండటం గమనార్హం. ఇక ప్రస్తుతం 3.4 కోట్ల మంది ప్రతి ఏడాది హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ప్రయాణాలు చేస్తుండగా, 2031 నాటికి ఈ సంఖ్య 5 కోట్లను దాటుతుందన్న అంచనాలున్నాయి. పెరిగే రద్దీని దృష్టిలో పెట్టుకొని జీఎమ్మార్ సంస్థ విమానాశ్రయంలో మరో నూతన టెర్మినల్‌ను కూడా మనుగడలోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడం, ముఖ్యంగా ప్రపంచ స్థాయి విమానాశ్రయాలకు దీటుగా మలిచేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎయిర్‌పోర్ట్ సీఈవో ఖదీర్ కదిరవన్ వెల్లడించారు ఆయన గురువారం ఇక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానాశ్రయాల్లో హైదరాబాద్ ముందున్నదని, బెంగళూరును మించిపోయిందన్నారు. గ్లోబల్ ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్ట్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోనే నాలుగో అత్యుత్తమ విమానాశ్రయ అవార్డును కైవసం చేసుకున్నదన్నారు. అలాగే విమానాశ్రయం ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలు కూడా భారీగా పెరిగాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్నివిధాలుగా కలిపి చూస్తే ఇప్పుడు 4 లక్షల మందికిపైగా పనిచేస్తున్నారని, 2038 నాటికి ఈ సంఖ్య 6 లక్షలకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే కాలంలో విమాన సర్వీసుల సంఖ్య భారీగా పెరుగుతుందని, ఇప్పటికే పలు విమానయాన సంస్థలు కొత్త విమానాల కోసం ఆర్డర్లు పెట్టాయని, అవి రాబోతున్నాయన్నారు.

# మీడియాకు ఎలాంటి సందేహాలున్నా..

## జూలై 18 ప్రెస్‌మీట్‌లో పూర్తి వివరాలు: రా ఎన్టీఆర్ ఫ్యాన్స్



**హైదరాబాద్:** రా ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన "ఊరూరా వాడా" కార్యక్రమం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా సినీ, రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమానికి సంబంధించి మీడియాలో, అభిమానుల్లో వస్తున్న అన్ని సందేహాలకు జూలై 18న నిర్వహించే ప్రెస్‌మీట్‌లో పూర్తి స్పష్టత ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ.100 కోట్ల నిధులు సేకరించి, వాటిని వివిధ సేవా కార్యక్రమాలకు వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తోడ్పడేలా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నదే ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే, ఈ కార్యక్రమం వెనుక జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ ఆరంగేట్రానికి సంకేతాలున్నాయా? అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. గతంలో 2009 ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జూనియర్ ఎన్టీఆర్ అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటూ పూర్తిగా సినిమాలపైనే దృష్టి సారించారు. అయినప్పటికీ, "ఊరూరా వాడా" కార్యక్రమం, రూ.100 కోట్ల నిధుల సేకరణ అంశాలు రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో జూలై 18న రా ఎన్టీఆర్ ఫ్యాన్స్ నిర్వహించనున్న ప్రెస్‌మీట్ కీలకంగా మారింది. కార్యక్రమం అసలు ఉద్దేశం ఏమిటి? నిధుల సేకరణ ఎలా జరుగుతుంది? వాటి వినియోగంపై ఏ విధమైన పారదర్శకత పాటిస్తారు? అలాగే రాజకీయాలకు సంబంధించిన ప్రచారంపై నిర్వాహకుల వైఖరి ఏమిటి? వంటి ప్రశ్నలకు ఆ సమావేశంలో సమాధానాలు లభించే అవకాశం ఉందని అభిమానులు, మీడియా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


# ఓటీటీలోకి 'మా ఇంటి బంగారం'..

## జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ ప్రారంభం




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మా ఇంటి బంగారం' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన ఈ చిత్రం, శుక్రవారం (జూలై 17) అర్ధరాత్రి నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. సుమారు మూడేళ్ల విరామం తర్వాత సమంత ప్రధాన పాత్రలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహించారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన జబర్దస్త్, ఓ బేబీ చిత్రాలు విజయవంతం కావడంతో ఈ సినిమాపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. వాటికి తగ్గట్టుగానే విడుదలైన తొలి రోజు నుంచే 'మా ఇంటి బంగారం'కు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు, మహిళలను ఆకట్టుకున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సమంత కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచింది. విదేశీ మార్కెట్‌లోనూ ఈ సినిమాకు మంచి స్పందన లభించింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్ సొంతం చేసుకుంది. ముందస్తు ప్రకటన మేరకు జూలై 17 నుంచి ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్‌పై సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. సమంతతో పాటు శ్రీనివాస గవిరెడ్డి, దిగంత్, గుల్షన్ దేవయ్య, శ్రీముఖి, గౌతమి, మంజూష, ఆనంద్, లక్ష్మి తదితరులు కీలక పాత్రలు పోషించారు. సంగీతాన్ని సంతోష్ నారాయణన్ అందించారు. థియేటర్లలో ఈ చిత్రాన్ని వీక్షించలేకపోయిన సినీ అభిమానులు ఇప్పుడు ఓటీటీ వేదికపై 'మా ఇంటి బంగారం'ను ఆస్వాదించే అవకాశం పొందారు.

# అజిత్ సినిమాలో కీలక పాత్ర?



అనతికాలంలోనే తారపథంలో దూసుకుపోతున్నది అస్సామీ సోయగం కయాదు లోహర్. డ్రాగన్, ఫంకీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ ప్రస్తుతం 'ది ప్యారడైజ్'లో నాని సరసన కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఆమె తమిళంలో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో అజిత్ 64వ సినిమా కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో కయాదు లోహర్ నటించనున్నట్లు తెలిసింది. కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఇదిలావుండగా సూర్య 48వ చిత్రంలో కూడా కయాదులోహర్ నాయికగా నటిస్తున్నది.

# హారర్ థ్రిల్లర్ 'ఆమెన్'



ఎస్‌బీకే ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై దర్శక నిర్మాత ఎస్‌కే బషీద్ రూపొందించిన హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆమెన్' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఆయన చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాలకు పూర్తి భిన్నంగా ఉండే చిత్రమిది. కొత్త నటీనటులతో తెరకెక్కించాం. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది. గుండె జబ్బులు ఉన్నవారు థియేటర్‌కు రావొద్దు. ఆద్యంతం ప్రేక్షకుల్లో ఉత్కంఠను కలిగిస్తూ అనూహ్య మలుపులతో ఆకట్టుకుంటుంది. ఇటీవల విడుదల చేసిన పోస్టర్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి నిర్మాత, దర్శకత్వం: ఎస్‌కే బషీద్.

# మోస్ట్ వాంటెడ్ 'ఫౌజీ'

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'ఫౌజీ' విడుదల తేదీ ఖరారైంది. ఈ సినిమాను డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు గురువారం మేకర్స్ ప్రకటించారు. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ పీరియాడిక్ డ్రామాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. 1940 దశకం నాటి స్వాతంత్ర్య సంగ్రామం, రెండో ప్రపంచయుద్ధం తాలూకు సంఘటనల నేపథ్యంలో అల్లుకున్న కల్పిత కథ ఇదని సమాచారం. రిలీజ్ డేట్ పోస్టర్‌లో ప్రభాస్ కదనరంగంలో క్షతగాత్రుడై రక్తమోడుతున్న దుస్తుల్లో కనిపిస్తున్నారు. బందూక్ చేపట్టి దీర్ఘాలోచనలో ఉన్న ఆయన లుక్ సినిమాలోని భావోద్వేగాల్ని ప్రతిఫలిస్తున్నది. ఓ యోధుడి త్యాగం, ధీరత్వానికి ప్రతీకలా ఈ లుక్ కనిపిస్తున్నది. '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ కూడా కథపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. భారీ స్థాయిలో యాక్షన్ ఘట్టాలతో పాటు బలమైన భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన–దర్శకత్వం: హను రాఘవపూడి.



# కథలోని భావోద్వేగాలు కదిలిస్తాయి



రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'రాజా ది రాజా' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో బృందావన్ క్రియేషన్స్ పతాకంపై కె.నిహారిక దాసరి నిర్మించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేస్తున్నది. గురువారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హీరో కావాలనే తన కల ఈ సినిమాతో నెరవేరిందని, టీమ్ అంతా పాషన్‌తో సినిమా చేశామని, ప్రీమియర్స్‌కు వచ్చిన స్పందన విజయంపై నమ్మకాన్ని పెంచిందని హీరో రుత్విక్ అన్నారు. వినూత్నమైన కథతో సినిమా తీశామని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని నిర్మాత కె.నిహారిక దాసరి తెలిపింది. కథలోని భావోద్వేగాలు ప్రేక్షకుల్ని కదిలిస్తాయని దర్శకుడు అనిల్ బోయిడపు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర సంగీత దర్శకుడు మార్క్ కె రాబిన్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# లార్డ్స్ వన్డేనే ఆఖరిదా?

**టీమిండియాలో సెగ.. రోహిత్‌కు పొగ!**

**మాజీ కెప్టెన్‌తో అగార్కర్, గంభీర్‌కు విభేదాలు**

**2027 వన్డే వరల్డ్‌కప్ ప్లాన్స్ నుంచి హిట్‌మ్యాన్ తొలగింపు!**

**యంగ్‌స్టర్ యశస్వి జైస్వాల్‌కే మేనేజ్‌మెంట్ మొగ్గు**



39 ఏండ్ల రోహిత్ 513 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 20,289 పరుగులు, 50 సాధించి జట్టుపై తనదైన ముద్ర వేశాడు. దీర్ఘకాలంగా ఆటగాడిగా, దేశానికి ఎనలేని సేవ చేసిన రోహిత్ తన కెరీర్ ముగింపుపై సొంతంగా నిర్ణయం తీసుకునే హక్కు అతడికి ఉన్నప్పటికీ, జట్టు ప్రయోజనాల దృష్ట్యా సెలక్టర్లు కూడా కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగే లార్డ్స్ మ్యాచ్ రోహిత్ కెరీర్‌కు విషమ పరీక్షగా మారనుంది. న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో మరో కలవరం. గతేడాది ఆస్ట్రేలియా గడ్డపై బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సమయంలో చూసిన డ్రామాను మించి ఇప్పుడు ఇంగ్లండ్‌లో రచ్చ నడుస్తోంది. తన అద్భుత, అసాధారణ కెరీర్‌లో లోటుగా ఉన్న వన్డే వరల్డ్‌కప్‌ను అందుకొని ఆటను ముగించాలని ఆశిస్తున్న రోహిత్ శర్మకు ఆ చాన్స్ దక్కేలా లేదు. 2027 వన్డే కప్ ప్రణాళికల్లో ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్‌ను తెరపైకి తీసుకొచ్చిన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. హిట్‌మ్యాన్‌ను జట్టు నుంచి తప్పించాలని డిసైడైనట్టు తెలుస్తోంది. ప్రస్తుత ఫామ్, వయసును దీనికి కారణంగా చెబుతూ.. జట్టు నుంచి పొమ్మనకుండానే అతనికి పొగబెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్న మాజీ కెప్టెన్ రోహిత్, అగార్కర్, గంభీర్ మధ్య పరస్పర నమ్మకం పూర్తిగా లోపించినట్లు తెలుస్తోంది. దాంతో ఆదివారం లార్డ్స్ క్రికెట్ స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరగబోయే మూడో వన్డే రోహిత్‌కు చివరి అంతర్జాతీయ మ్యాచ్ కానుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ సిరీస్ తర్వాత భారత్ స్వదేశంలో సెప్టెంబర్ 27న వెస్టిండీస్‌తో తదుపరి వన్డే ఆడనుంది.

**ముగ్గురి మధ్య ముదిరిన వివాదం**

గతంలో ద్రవిడ్ కోచ్‌గా ఉన్నప్పుడు రోహిత్, అగార్కర్ మధ్య సత్సంబంధాలు ఉండేవి. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో భారత్ 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ చేరడమే కాకుండా 2024 టీ20 ప్రపంచకప్ గెలిచింది. కానీ గంభీర్ రాకతో సమీకరణాలు పూర్తిగా మారాయి. నిజానికి ద్రవిడ్ తర్వాత భారత జట్టుకు హెడ్ కోచ్‌గా ఉండమని గంభీర్‌ను మొదట కోరింది రోహితే కావడం గమనార్హం. అప్పుడు 'నువ్వు కెప్టెన్‌గా ఉంటేనే నేను కోచ్‌గా వస్తా' అని రోహిత్‌కు గౌతీ చెప్పాడు. అదే సమయంలో ద్రవిడ్‌తో పోలిస్తే గౌతీ శైలి పూర్తిగా భిన్నంగా ఉంటుందని, తనతో పని చేయడం అంత సులువు కాబోదని రోహిత్‌కు అతని సన్నిహితులు చెప్పారు. వాళ్ల అంచనా నిజం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన తర్వాత రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి తొలగించడం అతడిని తీవ్ర నిరాశకు గురిచేసింది. సొంతగడ్డపై టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ (0-3) అయినప్పటి నుంచే రోహిత్, గంభీర్, అగార్కర్ మధ్య విభేదాలు మొదలయ్యాయి. గతేడాది ఆస్ట్రేలియా పర్యటన సమయానికి మరింత ముదిరాయి.

**అప్పుడు టెస్టులకు రిటైర్మెంట్.. ఇప్పుడు వన్డేలకు?**

బోర్డర్-గావస్కర్ ట్రోఫీ తర్వాత 2025లో ఇంగ్లండ్ పర్యటనకు టెస్టు టీమ్ ఎంపికలోనూ ఇరువర్గాల మధ్య స్పష్టత లోపించింది. సెలెక్టర్లు టీమ్ నుంచి డ్రాప్ చేస్తామని చెప్పడంతో రోహిత్ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించే పరిస్థితి వచ్చిందని అతని సన్నిహిత వర్గాలు చెప్పాయి. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో ఉన్న సెలెక్టర్లు, బోర్డు పెద్దలు తనతో పంచుకున్న 2027 వరల్డ్ కప్ నిర్ణయాలపై రోహిత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. టీమ్ మేనేజ్‌మెంట్ వ్యవహారశైలి అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. రెండో వన్డేలో 47 బంతుల్లో కేవలం 26 పరుగులు మాత్రమే చేసి విల్ జాక్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఎప్పుడూ దూకుడుగా ఆడే రోహిత్.. ఈ మ్యాచ్‌లో రక్షణాత్మక ధోరణిలో, తీవ్ర ఆందోళనతో కనిపించాడు. అయితే భారత బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ మాత్రం రోహిత్‌ను సమర్థించాడు. పిచ్‌పై బౌన్స్ సరిగా లేకపోవడం వల్లే రోహిత్ లయ అందుకోలేకపోయాడని, దానిని ఫామ్ కోల్పోవడం అనలేమని అన్నాడు. లార్డ్స్ వన్డేలో అతడు భిన్నంగా ఆడతాడని ధీమా వ్యక్తం చేశాడు.

**గణాంకాలు బాగున్నా.. తగ్గిన దూకుడు**

చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత రోహిత్ 14 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 45.3 సగటు, 92.03 స్ట్రైక్ రేట్‌తో ఒక సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీల సాయంతో 589 పరుగులు చేశాడు. ఈ గణాంకాలు అతడి కెరీర్ సగటు (48.58 సగటు, 92.76 స్ట్రైక్ రేట్)కు దగ్గరగానే ఉన్నప్పటికీ, పరుగులు సాధిస్తున్న తీరు మాత్రం ఆందోళన కలిగిస్తోంది. 2023 వన్డే ప్రపంచకప్‌లో 54.27 సగటు, 125.94 భీకర స్ట్రైక్ రేట్‌తో ఆడి భారత్‌ను ఫైనల్‌కు చేర్చిన రోహిత్ మార్క్ దూకుడు ప్రస్తుత ఆటలో కనిపించడం లేదు. ప్రతి ఇన్నింగ్స్ అతడికి ఒక పరీక్షలా మారడంతో క్రీజులో స్వేచ్ఛగా ఆడలేకపోతున్నాడు. మరోవైపు, జట్టులో స్థానం కోసం యువ ఆటగాళ్ల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ఓపెనర్ స్థానం కోసం 24 ఏండ్ల ముంబై యువ సంచలనం యశస్వి జైస్వాల్ వన్డేల్లోనూ తన ముద్ర వేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. చివరి మూడు వన్డేల్లోనే జైస్వాల్ రెండు శతకాలు బాదాడు. దక్షిణాఫ్రికాపై సెంచరీ చేసిన రుతురాజ్ కూడా రేసులోకి రావడంతో రోహిత్‌పై ఒత్తిడి పెరిగింది.



## వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం సర్ గ్యారీ సోబర్స్ కన్నుమూత

ప్రపంచ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందిన వెస్టిండీస్ దిగ్గజం సర్ గ్యారీ సోబర్స్ (89) కన్నుమూశారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లోనూ అసాధారణ ప్రతిభ కనబర్చిన సోబర్స్ మృతి క్రికెట్ ప్రపంచాన్ని విషాదంలో ముంచెత్తింది. 1953లో కేవలం 16 ఏళ్ల వయసులో బార్బడోస్ తరపున ఫస్ట్‌క్లాస్ అరంగేట్రం చేసిన సోబర్స్, మరుసటి ఏడాదే వెస్టిండీస్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. 1958లో పాకిస్థాన్‌పై అజేయంగా 365 పరుగులు చేసి అప్పటికి టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు ప్రపంచ రికార్డు నెలకొల్పారు.



ఆ రికార్డును 1994లో మరో వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా అధిగమించాడు. 1968లో వేల్స్‌లోని స్వాన్సీలో గ్లామోర్గన్‌పై జరిగిన ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో ఒకే ఓవర్లో ఆరు వరుస సిక్సర్లు బాదిన తొలి క్రికెటర్‌గా సోబర్స్ చరిత్ర సృష్టించారు. ఆ ఘనత ఆయన కెరీర్‌లో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోయింది. 1974లో 38 ఏళ్ల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సోబర్స్, తన కెరీర్‌లో 93 టెస్టులు ఆడి 8032 పరుగులు (సగటు 57.78) చేసి 235 వికెట్లు తీశారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 383 మ్యాచ్‌ల్లో 28 వేలకుపైగా పరుగులు, 1000కు పైగా వికెట్లు సాధించారు. క్రికెట్‌కు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 1975లో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు నైట్‌హుడ్ (నైట్) బిరుదును ప్రదానం చేసింది.

## క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లిన పీవీ సింధు

**ప్రపంచ నం.5 హా యుపై సంచలన విజయం.. జపాన్ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శన**



టోక్యో: డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో తన జోరు కొనసాగిస్తోంది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హా యు (చైనా)పై అద్భుత ప్రదర్శనతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. కేవలం 35 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధు 21-16, 21-14 తేడాతో హా యును ఓడించింది. తొలి గేమ్‌లో ఆరంభంలో స్వల్ప పోటీ ఎదురైనా, రిథమ్ అందుకున్న తర్వాత సింధు పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది. రెండో గేమ్‌లో మరింత దూకుడుగా ఆడిన సింధు వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించి 8-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత కూడా ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సింధు ఆతిథ్య జపాన్‌కు చెందిన మాజీ ప్రపంచ చాంపియన్ నొజొమి ఒకుహారాతో తలపడనుంది. ఈ మ్యాచ్‌పై బ్యాడ్మింటన్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇక మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత జోడీ తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల పోరాడి ఓడింది. టాప్ సీడ్ చైనా జోడీ ఫెంగ్ యాన్ ఝె-హువాంగ్ డాంగ్ పింగ్ చేతిలో 20-22, 17-21 తేడాతో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## బుడాపెస్ట్‌లో అమన్‌కు స్వర్ణం

**ర్యాంకింగ్ సిరీస్‌లో భారత రెజ్లర్ సత్తా.. దీపక్‌కు కాంస్యం**

బుడాపెస్ట్ (హంగేరి): బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్ రెజ్లింగ్ టోర్నీలో భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ స్వర్ణ పతకంతో మెరిశాడు. పురుషుల 57 కిలోల ఫ్రీస్టయిల్ విభాగం ఫైనల్లో జర్మనీకి చెందిన రాబర్ట్ డింగాష్విలిపై 13-3 తేడాతో ఏకపక్ష విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. టోర్నీ అంతటా నిలకడైన ప్రదర్శన కనబరిచిన అమన్, ఫైనల్లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక పురుషుల 61 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత రెజ్లర్ దీపక్ కాంస్య పతకం సాధించాడు. మూడో స్థానం కోసం జరిగిన పోరులో అజర్‌బైజాన్‌కు చెందిన నురద్దిన్ నవ్రుజొవ్‌పై 9-8 తేడాతో ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేశాడు. అమన్ స్వర్ణం, దీపక్ కాంస్యంతో బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్‌లో భారత రెజ్లర్లు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు.

## మూడో స్థానమెవరిదో?..





**కీలక పోరుకు ఫ్రాన్స్, ఇంగ్లండ్ సిద్ధం**

**రేపు తెల్లవారుజామున 2.30 గంటలకు యునైట్ 8 స్పోర్ట్స్,జీ5లో లైవ్**

మయామి గార్డెన్స్: సుమారు ఐదు వారాలుగా సాకర్ ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ చివరి అంకానికి చేరుకుంది. 48 జట్లు తలపడిన ఈ టోర్నీలో స్పెయిన్, అర్జెంటీనా టైటిల్ పోరుకు సిద్ధమవగా అంతకంటే ముందు మూడో స్థానం కోసం ప్రపంచకప్‌లో నిలకడగా రాణించిన ఫ్రాన్స్, ఇంగ్లండ్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆదివారం తెల్లవారుజామున మయామి గార్డెన్స్ వేదికగా ఈ రెండు జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గ్రూప్, నాకౌట్ దశల్లో అప్రతిహత విజయాలతో సెమీస్ చేరి వరుసగా మూడోసారి ఫైనల్‌కు వెళ్లాలన్న ఫ్రాన్స్‌కు స్పెయిన్ షాకివ్వగా అదే జోష్‌లో సెమీఫైనల్స్‌కు వచ్చిన ఇంగ్లండ్‌కు అర్జెంటీనా చెక్ పెట్టింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా ఉన్నా సెమీస్ మెట్టుపై తడబడ్డ ఈ జట్లు ఈ పోరులో గెలిచి మూడో స్థానంతో టోర్నీని ముగించాలని ఆశిస్తున్నాయి. ఫ్రాన్స్ సారథి కిలియన్ ఎంబాపె (8 గోల్స్)కు గోల్డెన్ బూట్ రేసులో మెస్సీకి పోటీనివ్వడానికి ఇదే ఆఖరి అవకాశం. అదే జట్టుకు చెందిన మరో స్టార్ ఉస్మాన్ డెంబెలె సైతం ఆరు గోల్స్‌తో జోరుమీదున్నాడు. 14 ఏండ్లుగా ఫ్రాన్స్‌కు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న దిదియె డిషాంప్ కూడా ఈ మ్యాచ్‌తో ఆ జట్టుకు వీడ్కోలు చెప్పబోతున్న నేపథ్యంలో ఫ్రెంచ్ టీమ్ భారీ విజయంపై కన్నేసింది. మరోవైపు రెండో సెమీస్‌లో గెలుపు అంచుల దాకా వచ్చిన ఇంగ్లండ్.. మెస్సీ సేన ఆఖర్లో చేసిన అద్భుతంతో తమకు ఎదురైన ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నది. టోర్నీలో హయ్యస్ట్ గోల్స్ చేసినవారిలో యువ సంచలనం జూడ్ బెల్లింగ్‌హామ్ (6), కెప్టెన్ హ్యారీ కేన్ (6) సైతం జోరుమీదున్నారు. కప్పు కలను నెరవేర్చుకోలేకపోయినా మూడో స్థానంతో ముగించాలని ఇరుజట్లూ భావిస్తున్న వేళ రెండు టాప్ టీమ్స్ మధ్య మరో రసవత్తర సమరం జరుగనుండటం ఖాయంగా కనిపిస్తున్నది.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/